క్లుప్తంగా

గ్రామాల్లోనే స్పెషలిస్టు వైద్యుల సేవలు

గనికపూడి(ప్రత్తిపాడు): గ్రామాల్లోనే స్పెషలిస్టు వైద్యులతో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి మేరి యునిస్ అన్నారు. మండల పరిధిలోని గనికపూడి యూపీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి, జనరల్ మెడిసిన్ డాక్టర్ మౌనిక, ఆర్థోపెడిక్ వైద్యాధికారి డాక్టర్ ఏ హేమంత్, ఆప్తాలమిక్ అసిస్టెంట్ శివరామకృష్ణ 137 మంది రోగులకు పరీక్షలు చేశారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వారికి ఉచిత మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మేరియునిస్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష క్యాంప్‌ల ద్వారా నిష్ణాతులైన వైద్యులు వైద్యసేవలందిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఎంతో సదుద్దేశ్యంతో నిర్వహిస్తున్న క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎస్. విజయకుమారి, కె.చెల్లమ్మ పాల్గొన్నారు.

కనుల పండువగా స్వామి కల్యాణం



కాకుమాను: స్థానిక గంగా పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు.

యువతి అదృశ్యం



పెదకాకాని: మతిస్థిమితం లేని యువతి అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. పెదకాకాని సుందరయ్యకాలనీకి చెందిన షేక్ నన్నీబి మస్తాన్ దంపతులకు నలుగురు సంతానం. వారిలో మూడో కుమార్తె షేక్ రంజాన్‌బీకి చిన్నతనం నుంచి మతిస్థిమితం లేదు. చిన్నపిల్లలాగా ఇంటి పక్కల ఉన్న వారితో ఆడుకుంటూ ఉంటుంది. సోమవారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో కాలనీలో కనిపించలేదు. చుట్టుప్రక్కల ఉన్న గ్రామాల్లో విచారించినప్పటికీ ఆచూకీ కనిపించలేదు. దీంతో రంజాన్‌బీ తల్లి నన్నీబీ పెదకాకాని పోలీసులను ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

ఉపాధ్యాయులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక విద్యాబోధన దిశగా ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని డీఈఓ పి.శైలజ పేర్కొన్నారు. రైలు పేటలోని గొలుసు నాంచారమ్మ- కొండలరావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ నూతన బోధన పద్ధతులను నేర్చుకుని, తమలోని బోధన నైపుణ్యాలను మెరుగుదిద్దుకోవాలని సూచించారు. అదే విధంగా టెన్త్ విద్యార్థులకు జరుగుతున్న బోధన తీరు, తెన్నులను ఆమె పరిశీలించారు.

టోఫెల్ శిక్షణ కోసం విద్యార్థిని దత్తత

ఇదే పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థిని జొన్నలగడ్డ లౌక్యను టోఫెల్ బోధించేందుకు డీఈఓ శైలజ దత్తత తీసుకున్నారు. అదే విధంగా జిల్లాలోని విద్యాధికారులతో పాటు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు టోఫెల్ బోధించేందుకు ఆరో తరగతి విద్యార్థులను దత్తత తీసుకుని, వారి వివరాలను గూగుల్‌ఫామ్‌లో పూరించి డీఈఓ కార్యాలయానికి పంపాలని సూచించారు. తద్వారా విద్యార్థుల్లో ఆంగ్ల భాషా సామర్థ్యాలు గణనీయంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని వివరించారు. మహిళా ఉపాధ్యాయినులు బాలికలను, పురుష ఉపాధ్యాయులు బాలురను దత్తత తీసుకోవాలని కోరారు.

నేడు బూత్‌లెవల్ నాయకుల ఆత్మీయ సమావేశం

గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం బూత్‌లెవల్ నాయకుల ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. గుంటూరు మిర్చియార్డు రోడ్డులోని వైజంక్షన్ వద్ద ఉన్న వీఆర్‌కే కన్వెన్షన్‌లో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, గుంటూరు పార్లమెంట్ సమన్వయకర్త ఉమ్మారెడ్డి వెంకటరమణ పాల్గొంటారని తెలిపారు.

ఓటు విలువపై అవగాహన

గుంటూరు రూరల్: ఓటు సమ్మకమైన నాయకుడిని ఎన్నుకునేందుకు ప్రజలకున్న వజ్రాయుధం ఓటు హక్కు అని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. మంగళవారం ఏఎన్‌యూ, చలపతి ఫార్మసీ కళాశాల సంయుక్తంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు లాం గ్రామంలో ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య
- చేబ్రోలులో వలంటీర్లకు పురస్కారాల ప్రదానం



చేబ్రోలులో సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు పొందిన వలంటీర్లతో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తదితరులు



మున్సిపల్ కార్యాలయంలో పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్యే రోశయ్య అధికారులు, నాయకులు

చేబ్రోలు: వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వద్ద గ్రామ వలంటీర్లకు సేవా పురస్కారాల ప్రదానోత్సవం మంగళవారం నిర్వహించారు. ఇరువురు వలంటీర్లుకు సేవా వజ్ర అవార్డు కింద రూ.45 వేలు, ఐదుగురికి సేవా రత్న అవార్డు కింద రూ.30 వేలు, 320 మందికి సేవా మిత్ర పురస్కారాల కింద రూ.15 వేలు చొప్పున అందించారు. సమావేశానికి డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని పేర్కొన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుండటంతో ప్రతిపక్షాలు ఓర్వలేక నిందలు వేస్తున్నాయని ఆరోపించారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలను కూడా లెక్కచేయకుండా వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి సిపార్సులు, లంచాలు లేకుండా సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత జగనన్నకు దక్కుతోందని వివరించారు. నవరత్నాల పథకాలు నూరు శాతం విజయంతంగా పేదలకు అందుతున్నాయంటే అది వలంటీర్ల కృషి వల్లనే అన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో రూ.1600 కోట్లను వివిధ సంక్షేమ పథకాల కింద వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి వలంటీర్‌కు రూ.పది లక్షల బీమా చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితి, గ్రామ సర్పంచి అత్తోట వినీతా రాణి, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, ఎంపీటీసీలు చుక్కా ఆదాము, ఇంటూరి జైపాల్ రెడ్డి, టి.అంజనాదేవి, వడ్లమూడి సర్పంచి ఎం.అనితారాణి, కె.ఈశ్వరరెడ్డి, కె.కిరణ్‌కుమార్, పెదమస్తాన్, శివరామకృష్ణ, పి.సుబ్బారావు, అప్పిరెడ్డి, చౌడయ్య, శ్రీరెడ్డి, షరీఫ్, మస్తాన్ పాల్గొన్నారు.

పొన్నూరు పట్టణంలో..

పొన్నూరు: పొన్నూరు పట్టణ, మండల ప్రజలకు విశేష సేవలందిస్తున్న గ్రామ, వార్డు వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కొనియాడారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పట్టణ వలంటీర్లకు, మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు సేవ వజ్ర, సేవా రత్న, సేవామిత్ర పురస్కరాల ప్రదానం చేశారు. సభకు మునిపల్లె పీఏసీఎస్ చైర్మన్ కోటా శ్రీనివాస రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రోశయ్య పాల్గొని మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్ల పాత్ర మరువలేనిదన్నారు. ఎంపీపీ భవనం పద్మలీల మాట్లాడుతూ గ్రామ, వార్డు వలంటీర్లు విశ్వసనీయతకు మారుపేరు అన్నారు. పట్టణ పరిధిలో వలంటీర్లు మోహనకృష్ణ శ్రీకాకుళంకు రూ.45 వేలతో సేవా వజ్ర, మండ్రు జయ గోపాల్, వెంకట శివ నాగలక్ష్మి, షేక్ పర్వీన్, పాపన మహేశ్వరికి రూ.30 వేలతో సేవా రత్న పురస్కారాలు, మరో 321 మందికి రూ.15 వేలతో సేవా రత్న పురస్కారాలు, మండల పరిధిలో టీ క్రాంతి కుమార్, గుడె అనిల్ కుమార్, కల్వకుడి సునీత, శాలిని పులిపాటి, షేక్ మున్నిలకు రూ.30 వేల నగదుతో సేవ రత్నా పురస్కారాలు, మరో 306 మందికి రూ.15 వేలతో సేవా మిత్ర పురస్కారాలు ఎమ్మెల్యే ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ నయీమ్ అహ్మద్, ఎంపీడీవో రత్నజ్యోతి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్ల, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెరికల కృష్ణమోహన్, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లను సత్కరిస్తున్న ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



గుంటూరు రూరల్ వలంటీర్లతో సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

పెదనందిపాడు: వలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక పురాణ కాలక్షేప కల్యాణ మండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు పోషిస్తున్న పాత్ర చాలా ముఖ్యమని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చారని, అన్ని సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా వారి ఇంటికే వచ్చి అందేలా వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కల్లూరి అన్నపూర్ణ, ఎంపీపీ టి.హెప్సిబా, వైస్ ఎంపీపీ కమ్మ సాంబశివరావు, పార్టీ మండల కన్వీనర్ షేక్ ఖాశింపీరా, ఆర్‌అండ్‌బీ రాష్ట్ర డైరెక్టర్ పిల్లి మేరీ, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు, ఎంపీటీసీలు చెల్లి లక్ష్మి, జంగా సుందర్, మేడిద మాలతి, సోషల్ మీడియా కన్వీనర్ స్వర్ణ రమేష్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికే వలంటీర్ వ్యవస్థ

గుంటూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమాన్ని కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి అందించిన వారధులు మన వలంటీర్లు అని ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని చల్లావారి

పార్టీ సమన్వయకర్త కిరణ్‌కుమార్

పాలెంలోని డీవీఎస్ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమన్వయకర్త మాట్లాడుతూ జగనన్న ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వలంటీర్ వ్యవస్థ దేశం మొత్తం ఏపీ వైపు చూసేలా చేసిందని పేర్కొన్నారు. ప్రజలకు నేరుగా సేవలందిస్తున్న వలంటీర్ల సేవలకు గుర్తింపుగా సేవ రత్న, సేవ వజ్ర , సేవ మిత్ర అవార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆళ్ల రవిదేవరాజు, వైస్ ఎంపీపీ దర్శి సుజాత, సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటప్పారెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూనె ఉమామహేశ్వరరెడ్డి, గ్రామ సర్పంచి ఆరుదల సాంబశివరావు, ఎంపీడీఓ ఆదినారాయణ, ఈఓపీఆర్‌డీ శ్రీనివాస రావు, పలు కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు పిల్లి మేరి, దగ్గుల మల్లికార్జున రెడ్డి, కందుకూరి జ్యోతి, పాత్తూరు సొసైటీ చైర్మన్ కాశీవిశ్వనాథం, కలిశెట్టి వెంకటరావు పాల్గొన్నారు.

హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాలి

ఎమ్మెల్యే సుచరిత



విద్యార్థులతో ఎమ్మెల్యే సుచరిత

ప్రత్తిపాడు: ప్రతి విద్యార్థి హక్కులతో పాటు బాధ్యతలు కూడా తెలుసుకుని మెరుగైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. పారా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మానవ హక్కుల క్లబ్ విద్యార్థులు మంగళవారం సంస్థ ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే సుచరితను గుంటూరులోని ఆమె కార్యాలయంలో కలిశారు. హైస్కూల్స్‌లో బాలల క్లబ్‌ల ద్వారా మానవ హక్కులు, బాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై కొద్దిరోజులుగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. మానవాభివృద్ధిలో మెరుగుదల సాధించేందుకు చేపట్టవలసిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను వినతి పత్రంలో పేర్కొన్నారు. పారా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ తురకా మంగయ్య, ప్రత్తిపాడు మండలం యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏపీజె అబ్దుల్ కలాం మానవ హక్కుల క్లబ్, అంబేడ్కర్ మానవహక్కుల క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం

పాత గుంటూరు: బ్రాడీపేట 2/7లోని శ్రీ గౌరి విశ్వేశ్వర స్వామి దేవాలయంలో స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు విశ్వేశ్వర శర్మ దంపతులతో కల్యాణం భక్తిశ్రద్ధలతో జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో పొన్నలూరి సీతారామాంజనేయులు, సీతారత్నకుమారి, ఉప్పలూరి గణేష్, కుమారి దంపతులు పాల్గొన్నారు. అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్ కుమార్ శర్మ, మల్లికార్జున శర్మ, చక్రపాణి, కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రాజశ్యామల యాగంలో అంబటి మురళీకృష్ణ

స్వామి వారి దృష్టికి జగన్నామ సంక్షేమ సంగమం సేవలు

చేబ్రోలు: విశాఖ శారదా పీఠంలో ఐదు రోజులుగా జరుగుతున్న వార్షికోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన రాజశ్యామల యాగంలో ఆఖరి ఘట్టమైన మహా పూర్ణాహుతి కార్యక్రమంలో బజరంగ్ ఫౌండేషన్ అధినేత అంబటి మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాజశ్యామలాదేవి శక్తివంతమైన దేవత అని, ఆమెను పూజించి హోమాలు చేయటం వల్ల వ్యాపార, రాజకీయ జీవితంలో విజయం ప్రాప్తిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 175 స్థానాలకు గానూ 175 స్థానాల్లో విజయం సాధించి తిరిగి అధికారంలోకి రావాలని, సుస్థిర సంక్షేమ ప్రభుత్వమే మళ్లీ కొనసాగాలని ఆకాంక్షించారు. త్వరలో పొన్నూరు పట్టణంలో జరగనున్న బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమ వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ మహాస్వామిని ఆహ్వానించామన్నారు. వారు రావడానికి సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. జగన్నామ సంక్షేమ సంగమంలో భాగంగా ప్రజలకు బజరంగ్ ఫౌండేషన్ చేసిన సేవలను స్వామివారికి ఫొటో అల్బమ్ ద్వారా అంబటి వివరించారు.



బజరంగ్ సేవలను ఫొటో అల్బమ్ ద్వారా పరిశీలిస్తున్న స్వామీజీ

నేడు బజరంగ్ నేత్రజ్యోతి కళ్లజోళ్ల పంపిణీ

పెదకాకాని: మండల కేంద్రమైన పెదకాకానిలోని రైల్వేగేటు సమీపంలోని ప్రాథమిక పాఠశాల ప్రక్కన ఏర్పాటు చేసిన నేత్రజ్యోతి శిబిరం ద్వారా వైద్య పరీక్షలు చేసిన 612 మందికి కళ్లజోళ్లను సిద్ధం చేసినట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. వారందరికీ బుధవారం కళ్లజోళ్ల పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు పంపిణీ చేస్తామని తెలిపారు. వ్యక్తిగత కళ్లజోళ్లకు అందుబాటులో ఉండి తమ కళ్లజోళ్లను పొందాలని అంబటి మురళీకృష్ణ కోరారు.

నవజాత శిశు మరణాలపై దృష్టి పెట్టండి

గుంటూరు మెడికల్: నవజాత శిశువుల మరణాలను తగ్గించేందుకు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కృషి చేయాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ కోరారు. అమరావతి రోడ్డులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో నవ జాతా శిశు సంరక్షణ అవసరం అంశంపై మంగళవారం సింపోజియం నిర్వహించారు. నవ జాతా శిశువుల సంరక్షణ బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. నవజాత శిశువుల జననానికి ముహుర్తాలు నిర్ణయించి ఆపరేషన్లు చేయాలని తల్లిదండ్రులు కోరుకోవడం బాధాకరమన్నారు. విద్యావంతులు కూడా అవగాహనా లేకుండా వ్యవహరిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఆధునిక వైద్యాన్ని అభ్యసించి వైద్యులు ప్రజలకు చేరువ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాధా రమణ శ్రీ, శాంత కుమారి పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యం

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: టీడీపీ 25 ఏళ్ల పాలనలో నియోజకవర్గానికి ధూళిపాళ్ల నరేంద్ర చేసిన అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య విమర్శించారు. మంగళవారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో పొన్నూరు అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. 57 నెలల కాలంలో నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా రూ.1,670 కోట్లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు తెలిపారు. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకొని పట్టణంలో రోడ్డు విస్తరణ చేసి, సుందరంగా తీర్చిదిద్దుకుంటే పట్టణ ప్రజల హర్షిస్తున్నారని చెప్పారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో తన హయాంలో చేసిన అభివృద్ధి చెప్పుకోలేక దుష్ప్రచారాలతో ధూళిపాళ్ళ నరేంద్ర ప్రజల్లోకి వస్తున్నాడని చెప్పారు. సంగం డెయిరీలో రైతుల బోనసులు కాజేసిన ఘనత నరేంద్రకే దక్కిందన్నారు. పట్టణంలోని ప్రజలకు సంబంధించిన భూములను దేవుడి మాన్యంలో కలిపి ఇబ్బందులు గురిచేసిన మాట వాస్తవం కాదా అన్నారు. ఈ విషయంపై నరేంద్ర ప్రజలకు సమాధానం చెప్పాలని సవాల్ చేశారు. దేవుడి మాన్యం నుంచి ఆ భూములను విముక్తి కలిగించిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కిందన్నారు. తెలుగు దుష్ప్రచారాల పార్టీ (టీడీపీ)ని వచ్చే ఎన్నికలలో కూడా ఘోర పరాజయం పాలు చేసేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రోడ్డు విస్తరణలో నష్టపోయిన భవన యజమానులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించి రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అనంతరం భవన యజమానులకు టీడీఆర్ బాండ్లు అందజేశారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్ల, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, మునిపల్లె పీఏసీఎస్ చైర్మన్ కోట శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెరికల కృష్ణమోహన్, దాసరి నారాయణరావు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన నాటికల పోటీలు



భానుమతి, కుర్రా శ్రీనులను సత్కరిస్తున్న దృశ్యం



క్షేత్రం నాటికలో సన్నివేశం

- సేవా రంగ ప్రముఖులకు ఆత్మీయ సన్మానం
- ప్రేక్షకులను ఆలోచింపజేసిన క్షేత్రం నాటిక

తెనాలిటౌన్: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నాటక కళాపరిషత్, తెనాలి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి తృతీయ ఆహ్వాన నాటికల పోటీలు మంగళవారం రెండో రోజు కొనసాగాయి. స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో పరిషత్ పోటీలు జరుగుతున్నాయి. పోటీలలో తొలుత బసవరాజు జయశంకర్ పర్యవేక్షణలో శ్రీ సద్గురు కళానిలయం గుంటూరు వారి 'బహురూపి' నాటికను ప్రదర్శించారు. శిష్టా చంద్రశేఖర్ రచించిన ఈ నాటికకు కె.వి.ప్రసాద్ దర్శకత్వం వహించారు. పట్టణంలో సేవా రంగ ప్రముఖులు అయిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి బ్రాంచి చైర్మన్ ఉమ్మలనేని భానుమతి, శివలింగేశ్వరస్వామి భక్త బృందం సేవా సమితి అధ్యక్షులు కుర్రా శ్రీనులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం రెండో ప్రదర్శనగా ఆరాధన ఆర్ట్స్ అకాడమీ గుంటూరు వారి ' క్షేత్రం' నాటికను ప్రదర్శించారు. శిల్ప ఆకురాతి రచన చేయగా జి.మనోహర్ దర్శకత్వం వహించారు. సాంఘిక నాటక రంగంపై సహజ కవి అయినాల మల్లేశ్వరరావు, ప్రముఖ నాటక రచయితలు డాక్టర్ చిలువూరు నాగేశ్వరరావు, ఆకురాతి భాస్కర్ చంద్రలు సమీక్ష జరిపారు. అనంతరం తృతీయ ప్రదర్శనగా కళావర్షిణి హైదరాబాద్ వారి 'అజరామరం' నాటికను ప్రదర్శించారు. హరిబాబు జెట్టి రచన, దర్శకత్వం వహించారు. మూడు నాటికల పోటీల కళాకారులకు ప్రదర్శన పారితోషకాన్ని ప్రణాళిక శాఖ ఉప కార్యదర్శి ఎ.వి.సుబ్బారావు, కావూరి సత్యనారాయణలు అందజేశారు. నాటక కళా పరిషత్ నిర్వాహకులు ఆరాధ్యుల కన్నా, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, అద్దేపల్లి లక్ష్మణ శాస్త్రి, పిట్టు వెంకట కోటేశ్వరరావు, కళాకారుల సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, తదితరులు పర్యవేక్షించారు.

సెంట్రల్ జైలులో ఖైదీ మృతి

కాకినాడ క్రైం: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న ఓ ఖైదీ కాకినాడ జీజీహెచ్‌లో మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. గుంటూరులోని ఆర్.అగ్రహారంకు చెందిన ఆలపాటి సాంబశివరావు(85), 2019లో బాలికపై లైంగిక దాడికి పాల్పడి జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు. 2021 జూలై 3వ తేదీన రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి చేర్చారు. అనారోగ్యానికి గురి కావడంతో ఈ నెల 13వ తేదీన జైలు అధికారులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడి వైద్యుల సిఫారసు మేరకు అదే రోజు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సాంబశివరావు మంగళవారం మృతి చెందగా కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చిరుధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు

- జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సి.తారాసత్యవతి
- కొల్లిపర మండలం దావులూరులో 11 రకాల సజ్జ, 10 రకాల జొన్న సాగు పరిశీలన



సజ్జ పైరును పరిశీలిస్తున్న డాక్టర్ సి.తారాసత్యవతి, డాక్టర్ సుబ్బారాయుడు, రైతులు

తెనాలి: వరి, గోధుమలకు మించిన పోషక విలువలు కలిగిన చిరుధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు లభిస్తాయని హైదరాబాద్‌లోని జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐఎంఆర్) డైరెక్టర్ డాక్టర్ సి.తారా సత్యవతి చెప్పారు. ఐఐఎంఆర్ ఆధ్వర్యంలో కొల్లిపర మండలం దావులూరులో 11 రకాల సజ్జ, 10 రకాల జొన్న పంటను సాగుచేసిన అభ్యుదయ రైతు గొట్టుముక్కల శ్రీధర్ పంటపొలాన్ని మంగళవారం సందర్శించారు. ఏపుగా పెరిగిన ఆయా రకాలను రైతులకు చూపారు. అక్కడే చిరుధాన్యాల ఆవశ్యకతను, సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. సదస్సులో డాక్టర్ తారా సత్యవతి మాట్లాడుతూ చిరుధాన్యాలతో రైతులకు అధిక ఆదాయంతోపాటు పోషక విలువలు కలిగిన ఆహారం లభిస్తుందన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఆ పంటల సాగు పెరుగుతోందని, దేశీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ పెరిగిందన్నారు. డెల్టాలో ఖరీఫ్ వరి సాగు తర్వాత జొన్న, సజ్జతో పాటు ఇతర చిరుధాన్యాలను జీరో టిల్లేజ్ విధానంలో సాగు చేపట్టాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారులు సంఘాలుగా ఏర్పడి ప్రాసెసింగ్ చేసుకుని అమ్మగలిగితే మరింత ఆదాయం లభిస్తుందని చెప్పారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సుబ్బారాయుడు తన ప్రసంగంలో, ఐఐఎంఆర్ 11 రకాల సంకరజాతి జొన్న విత్తనాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఇక్కడి రైతులు సాగుచేసే జొన్నలో ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే, ఐఐఎంఆర్ రకాల్లో 40-50 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయన్నారు. అధ్యక్షత వహించిన 'ఆత్మ' ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు మాట్లాడుతూ, లాభదాయకంగా ఉంటుందనే భరోసా ఇవ్వగలిగిన రకాలను అందిస్తే, విజయవంతం కాగలవన్నారు. అభ్యుదయ రైతు గొట్టుముక్కల శ్రీధర్ మాట్లాడుతూ ఐఐఎంఆర్ ఇచ్చిన 11 రకాల సజ్జ, ఆరు జొన్న రకాలతోపాటు వ్యవసాయశాఖ రెండు, తన సొంతంగా మరో రెండు రకాల మొత్తం 21 రకాల సజ్జ, జొన్న పంటలను సాగుచేసినట్టు తెలిపారు. లాం ఫారం చిరుధాన్యాల శాస్త్రవేత్త డాక్టర్ పుష్పరేణి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు రాజకుమారి, వ్యవసాయశాఖ ఏడీఏ ఉషారాణి మాట్లాడారు. కొల్లిపర వ్యవసాయాధికారి వెంకట్రావు స్వాగతం పలికారు. రైతులు, వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిదంబర శాస్త్రి దంపతులకు పురస్కారం

గుంటూరు ఎడ్యుకేషన్: భారతజాతి చిరకాల స్వప్నమైన శ్రీరామ మందిరం ఇన్నేళ్లకు సాకారమైందని హనుమ ఆధ్యాత్మిక కేంద్ర వ్యవస్థాపకుడు డాక్టర్ అన్నదానం చిదంబరశాస్త్రి పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో మంగళవారం చెరువు సూర్యనారాయణమూర్తి- సీతారావమ్మ పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చిదంబరశాస్త్రి దంపతులను పురస్కారంతో సత్కరించారు. సభకు అధ్యక్షత వహించిన హిందూ కాలేజీ హైస్కూల్ కౌన్సిల్ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ చిదంబరశాస్త్రి భారతీయ సాంస్కృతిక వైభవాన్ని పరిరక్షిస్తున్నారని, ఆయన రచనలు పలువురిని చైతన్య భరితం చేసినట్లు చెప్పారు. కార్యదర్శి కేఎస్ఆర్ కుటుంబరావు మాట్లాడుతూ చెరువు సూర్యనారాయణ మూర్తి- సీతారావమ్మ పేరిట ఏర్పాటు చేసిన పురస్కార పూర్వ గ్రహీతలను పరిచయం చేస్తూ, సూర్యనారాయణ మూర్తి విద్యా సేవలను కొనియాడారు. హిందూ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ దీవి నరసింహ దీక్షితులు మాట్లాడుతూ చిదంబర శాస్త్రి సాహిత్య సేవలు, భారతీయ ధర్మాన్ని ప్రచారం చేస్తున్న తీరు వివరించారు. చెరువు సత్య నారాయణ మూర్తి, డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి , జూపూడి రంగరాజు కళాశాల కార్యదర్శి రామకృష్ణమూర్తి, బండ్లమూడి హనుమాయమ్మ కళాశాల కార్యదర్శి శాంతి భూషణ్ పాల్గొన్నారు.